# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తుఫాను నేపథ్యంలో కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని సహాయక బృందాలను తరలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- ❖ మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు రాష్ట్రం ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ❖ జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- ❖ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను రేపటి నుంచే ప్రారంభించాలని మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు.
- ❖ మొంథా తుఫాను ఈరోజు రాత్రి కాకినాడ సమీపంలో తీవ్ర తుఫానుగా తీరం దాటే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

=======================

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కార్యాలయం నుండి మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తుఫాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనా వేస్తూ.. అందుకు తగినట్టుగా యంత్ర సామాగ్రిని, సమాచార పరికరాలను, అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

======================

మొంథా తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని, కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారని మంత్రి లోకేశ్ తెలియజేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు సూచించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు.

======================

రైతాంగానికి ఉపశమనం కల్పించేలా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను రేపటి నుంచే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో మంత్రి ఈరోజు మాట్లాడుతూ... ప్రస్తుతం మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కొనుగోలు కేంద్రాలలో తక్షణమే పత్తి సేకరణ చేపట్టాలని సీసీఐ అధికారులకు స్పష్టం చేశారు. 2025-26 సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాళ్కు 8,110 రూపాయల కనీస మద్దతు ధరను రైతులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

విరామం

======================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ఈరోజు రాత్రి తీవ్ర తుఫానుగా తీరం దాటే అవకాశం ఉందని విశాఖపట్టణంలోని తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. ఇది ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ.. కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుండి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఆయన వెల్లడించారు.

(వాయిస్ 32 సెకన్లు)

======================

మొంథా తుఫాను దృష్ట్యా కాకినాడ జిల్లాలోని తీర, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అన్ని వసతులతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి ఆశ్రయం కల్పించామని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన తుఫాను సహాయక చర్యలపై కలెక్టర్ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాను ప్రభావానికి గురయ్యే ప్రాంతాల్లో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలియజేశారు. 24 గంటలు పనిచేసే

కంట్రోలు రూమ్ లు ఏర్పాటు చేసి తుఫాను పరిస్థితిని, సహాయ పునరావాస కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షిస్తున్నామన్నారు. పాఠశాలలన్నింటికీ సెలవులు ప్రకటించామని, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులను సురక్షితంగా ఇంటికి పంపామని తెలిపారు. సముద్ర వేటలో ఉన్న బోట్లన్నిటినీ తీరానికి రప్పించామని, అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులకు సూచించామని కలెక్టర్ తెలియజేసారు.

======================

మొంథా తుఫాను దృష్ట్యా విశాఖలోని కొండవాలు ప్రాంతాలలో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... విశాఖలో పలు ప్రాంతాలలో గడచిన 24 గంటల్లో 14 నుండి 18 సెంటీ మీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించామని, పరిస్థితులు మారే వరకు అందరూ అక్కడ రక్షణ పొందాలని కలెక్టర్ పేర్కొంటూ....

(వాయిస్ 31 సెకన్లు)

======================

మొంథా తుఫాను నేపథ్యంలో తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వే జోన్ల పరిధిలో పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. తుఫాను దృష్ట్యా కోస్తాంధ్ర జిల్లాల మీదుగా నడిచే 116 రైళ్లను రద్దు చేశామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ ఓ శ్రీధర్ తెలిపారు. ఆరు రైళ్లను దారి మళ్లించామని, 27 రైళ్లను రీ షెడ్యూలు చేశామని ఆయన వెల్లడించారు.

======================

మొంథా తుపాను నేపథ్యంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను, కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. తుఫాను కారణంగా రైతులు నష్టపోతే.. పూర్తిగా ఆదుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుఫానుపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగం ఆస్తి ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే తాడిచెట్టు పడి ఒక మహిళ మరణించడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

======================
======================